W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

13-5-2025



## బీజేపీ బీఆర్ఎస్ ఒకటే

ఒకరు స్క్రిప్ట్ రాస్తారు.. మరొకరు డెలివరీ చేస్తారు

03

ధనిక రాష్ట్రం అంటూ షో చేసి ఆగం చేశారు

ఉన్న విషయాన్నే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలముందుంచారు

ప్రతిపక్షాల విమర్శలకు ఒక హద్దు ఉండాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

09



## అక్రమ ఫైనాన్స్ వ్యాపారాలపై పోలీసుల దాడులు

- ఆనాధికార చిట్స్ నిర్వహిస్తున్న వ్యాపారుల ఇండ్లలో పోలీసులు సోదాలు
- వ్యాపారుల నుండి 120 ఖాళీ బ్యాంక్ చెక్స్, 570 ప్రాంసరీ నోట్లు, 38 బాండ్లు స్వాధీనం
- అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు

09




మహా ఎఫెక్ట్

## ఇసుక అక్రమ రవాణా జరిగితే ఉక్కు పాదం మోపుతాం

చింతకాని మండలం పరిధిలోని చిన్నమండవ గ్రామంలో ఇసుక రవాణా జరిగే వారిపై ఉక్కు పాదం మోపుతామని సబ్ ఇన్స్పెక్టర్ నాగుల్ మీరా తెలియజేశారు ... చిన్నమండవ గ్రామంలో ఇసుక రవాణా జరుగుతున్న విషయం డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుసుకొన ఎస్సై తన సిబ్బందితో గ్రామంలోని జెసిపి తీసుకువెళ్లి ట్రాక్టర్స్ తిరగకుండా గాడి కొట్టించడం జరిగింది.

ఖమ్మం, మహా



10

# దోపిడీ ఆస్పత్రులు

వైద్యం అనేది ఓ సేవ. అది వ్యాపారం అయితే, రోగి కేవలం ఖాతాదారుడే అవుతాడు. కానీ ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంగా నెలకొన్న వైద్య వ్యవస్థ గుండెను తాకే మానవీయతను కోల్పోయి, నగదు లెక్కించే నిధి యంత్రంగా మారింది. వైద్యం అనే మాటకు కనీస మానవీయ అర్థం లేకుండా పోయింది. ఖమ్మం జిల్లాలో 422 హాస్పటల్ ఉన్నాయి. వీటిలో 80 శాతం ప్రైవేట్ ఆసుపత్రులు వాణిజ్య గదుల్లో మారిపోయాయి. అంబులెన్స్ సైరన్లు నడిచే బదులు, బిల్లుల బజార్ అరిచే స్థాయికి చేరాయి. వైద్య కళను అధిక వడ్డీతో పెట్టుబడిగా మార్చిన యాజమాన్యాల మానవ హక్కుల హత్య ఇది. ఇది ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిన సంకేతం కాదు... ఇది ప్రజాస్వామ్య చైతన్యానికి ఇచ్చే అత్యవసర హెచ్చరిక! ప్రతి ఆసుపత్రిలో ఓ గదిలో కన్నీరు ఉంటుంది. ప్రతి బిల్లులో ఓ కుటుంబ బాధ ఉంటుంది. ఖమ్మంలో వైద్య వ్యవస్థ ప్రజలను రోగులుగా కాకుండా, ఆదాయ వనరులుగా చూడడం ప్రారంభించింది. ఇది ప్రశ్నించాల్సిన సమయం. వైద్యం సేవ అవ్వాలి... వ్యాపారం కాదు అని హక్కుగా చెప్పాల్సిన సంక్షోభపు దశ ఇది.

## అనుమతులు లేకుండా నిర్వహణ

- అవసరం లేకున్నా అడ్డగోలు టెస్టులు
- ఆర్ ఎంపీలకు 50 శాతం కమిషన్
- ముందుగా బిల్లులు చెల్లిస్తేనే ఆపరేషన్
- పేషంట్ల బంధువులు ధర్నాలు చేస్తే కేసులు
- గుట్టుగా అక్రమాలు..
- ఖమ్మంలో వైద్యమంటే సీన్ సితారే



### డబ్బు లేనిదే చికిత్స జరగదు !

అపరేషన్ చేయాలంటే ముందుగా లక్షల్లో బిల్లు చెల్లించాలంటూ బెదిరింపులు. రోగి పరిస్థితి ఎంత క్లిష్టమైనదైనా, ముందుగా అడ్వాన్స్ ఇవ్వక పోతే తలుపులు మూసే పరిస్థితి. ఒక రోగిని గుండె ఆపరేషన్ కోసం తీసుకెళ్లినప్పుడు, "ముం దు పది లక్షలు ఇవ్వండి" అంటూ రిసెప్షన్ వద్దే అడ్డుకున్న ఘటనలు లెక్కలేనన్ని.

FOLLOW: @ANNTELUGU
13-5-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# ప్రణాళికాబద్ధంగా భూ సేకరణ

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం, మహా:** సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నదీ భూ సేకరణ, ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధిపై జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మొత్తం భూమి, వీటిలో అసైన్డ్ ప్రభుత్వ పట్టా ఎంత ఉంది, ప్రైవేట్ పట్టా భూమి ఎంత సేకరించాలో స్పష్టమైన సమాచారంతో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ భూమి ఎంత సేకరించాలో వివరాలు అందిస్తే ప్రత్యామ్నాయ భూములలో అటవీ పెంపకం చర్యలు చేపడతామని అన్నారు. జిల్లాలో మండలాల వారీగా సేకరించాల్సిన అటవీ భూమి, అసైన్డ్ ప్రభుత్వ భూములు, ప్రైవేట్ పట్టా భూముల వివరాలతో నివేదిక శుక్రవారం నాటికి అందించాలని కలెక్టర్ తెలిపారు. భూ సేకరణలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూముల సేకరణ సర్వే నిమిత్తం డిజిపిఐ ఆధునిక సర్వే యంత్రాలతో సర్వేయర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి జూన్ 12 నాటికి వివిధ కేటగిరీల వారీగా భూ సేకరణకు సంబంధించిన తుది నివేదిక తయారు చేయాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి 11 విద్యుత్ స్తంభాలు, నాలుగు టవర్ లు షిఫ్టింగ్ కు సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని, దీనికి అవసరమైన చెల్లింపులు విద్యుత్ శాఖకు వారం రోజులలో చేపట్టాలని, సంబంధిత పనులు రాబోయే వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అన్నారు. మున్నేరు నదీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం రైతులకు, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మే 25 నాటికి ప్రజలను క్షేత్ర స్థాయిలో తీసుకుని వెళ్లి లేఔట్ చూపించాలని అన్నారు. రాబోయే వర్షా కాలం లోపు నిర్ణీత పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఎటువంటి గ్యాప్స్ ఉండటానికి వీలు లేదని, మున్నేరు నది రిటైనింగ్ వాల్ 17 కిలో మీటర్ల స్ట్రెచ్ లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం, ప్రత్యామ్నాయ లేఔట్ భూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని దశల వారీగా అవసరమైన నిధుల వివరాలు త్వరగా చెల్లింపులు అయ్యేలా చూస్తామని అన్నారు. ప్రజలకు అందించే భూములలో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు, కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఇర్రిగేషన్ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అర్జీలను త్వరగా పరిష్కారించాలి

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో ముందు తన పేరు వచ్చిందని, తర్వాత తొలగించారని తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నాగులవంచ రెవెన్యూ గ్రామానికి చెందిన జి. రాములు తనకు సర్వే నెంబర్ 279ఆ/1/1 లో ఎకరం 10 గుంటల భూమి ఉందని, నాగులవంచ చొప్పకట్లపాలెం రోడ్డు 4 అడుగుల ఎత్తులో వేస్తున్నారని, దీనివల్ల తన భూమితో పాటు 100 ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని, పంట పొలాలు వర్షపు నీరుకు మునిగిపోకుండా తూములు వేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు రాస్తూ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అన్నారు.

## పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్స్‌ను సత్కరించిన ఎంపీ





**ఖమ్మం - మహా:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్స్ పోటీలలో విజేతలైన బోయిన కార్తీక్,రాపర్తి రాజా,పవన్ రిషి,పొన్విత్ లను శాలువాలతో సత్కరించి అభినందించారు. హైదరాబాద్ ఓల్డ్ బోయినపల్లిలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎక్విప్పెడ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ –2025 పోటీల 120 కిలోల సీనియర్స్ విభాగంలో ఖమ్మం నగరానికి చెందిన బోయిన కార్తీక్ ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే,ఆయన బెంచ్ ప్రెస్ పోటీల్లో ద్వితీయ బహుమతి అందుకుని,జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జూనియర్స్ 120 కిలోల విభాగంలో జీ.పవన్ రిషి ద్వితీయ, బెంచ్ ప్రెస్ పోటీల్లో ప్రథమ బహుమతులు అందుకున్నారు. బెంచ్ ప్రెస్ ఖమ్మం జిల్లా ఛాంపియన్ షిప్ ను రాపర్తి రాజా,పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ పోటీల్లో ఆర్.పొన్విత్ ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఎంపీ రవిచంద్రను వారు కలువగా, శాలువాలతో సత్కరించారు,ఈ రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ తన ఆశీస్సులు అందజేశారు.

## టీజీఎప్ సెట్ ఫలితాలలో ర్యాంకు సాధించిన అభిప్రాయ్



**ఖమ్మం - మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎప్ సెట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో (2300) ర్యాంకు సాధించిన ఆకుతోట అభిప్రాయ్‌కు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పుష్ప గుచ్ఛమిచ్చి, శాలువాతో సత్కారం చేసి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువును ఇష్టపడి చదివే వారు భవిష్యత్ లో మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం తనికెళ్ళ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆకుతోట ఆదినారాయణ,బ్రౌన్ కాలేజ్ లో అధ్యాపకురాలిగా పనిచేసే అరుణకుమారి దంపతుల కుమారుడు అభిప్రాయ్. ఎల్ కేజీ నుంచి ప్లస్ టూ(ఇంటర్,సిబిఎస్ఈ) వరకు ఖమ్మంలోని హార్వెస్ట్ విద్యాసంస్థలో అభిప్రాయ్ విద్యనభ్యసించారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన అభిప్రాయ్ ను హార్వెస్ట్ ప్రిన్సిపాల్ ఆర్.పార్వతి రెడ్డితో పాటు పలువురు అధ్యాపకులు, బుధుమిత్రులు అభినందించారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చెయ్యండి



**ఖమ్మం సిటీ, మహా:** కార్మిక ,కర్షక , విద్యార్థి, నిరుద్యోగ యువత, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కారం, మూడు వ్యవసాయ నల్ల చట్టాల, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సారవత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక లోకానికి అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.. ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్లో ఐ ఎన్ టి యు సి నగర అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు అధ్యక్షతన అఖిలపక్ష కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐ ఎన్ టి యు సి,ఏఐటియుసి, సిఐటియు, టి యు సి ఐ, ఐఎఫ్టియు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారానికొచ్చి 11 సంవత్సరాలు పూర్తైఐనా రైతాంగ, కార్మికవర్గ, ప్రజల సమస్యలనుపరిష్కరించలేదన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, ఆకలి మొదలైన కీలక అంశాలను ప్రజల దృష్టి నుండి మరల్చడానికి ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బిజెపి మతతత్త్వ శక్తులు ఎప్పుడు మతం పేరుతో దేశ సమగ్రత దెబ్బతింటుందంటూ అబద్దాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టీ విష్ణువర్ధన్, కళ్యాణపు వెంకటేశ్వరరావు. టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామయ్య, నగర అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి లక్ష్మీనారాయణ , కొయ్యల శ్రీను, నగర నాయకులు కంకనాల శ్రీనివాస్ , శివ, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు షేక్ సుభానిలి, లిజిల్లా నాయకులు గౌని మోహన్ రావులిఐ ఎన్ టియుసి నగర ప్రధాన కార్యదర్శి కొమ్మెర సంగయ్య , నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కింబసర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బీఆర్ఎస్ ఒకటే




## ఒకరు స్క్రిప్ట్ రాస్తారు.. మరొకరు డెలివరీ చేస్తారు

- ధనిక రాష్ట్రం అంటూ షో చేసి ఆగం చేశారు
- ఉన్న విషయాన్నే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలముందుంచారు
- ప్రతిపక్షాల విమర్శలకు ఒక హద్దు ఉండాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

**ఖమ్మం , మహా:** బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని, ఒకరు స్క్రిప్ట్ రాసిస్తే మరొకరు డెలివరీ చేస్తారని, ఢిల్లీ స్థాయిలోనే మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధనిక రాష్ట్రం అంటూ గత పాలకులు షో చేశారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే లోగుట్టు మొత్తం బయట పడిందన్నారు. తినడానికి తిండి లేకున్నా మీసాలకు సంపెంగ నూనె రాసి ప్రజలను మభ్య పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### యథార్థ పరిస్థితినే సీఎం చెప్పారు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల చిట్టా చూసి బాదేసిందని, దాదాపు 8 లక్షల 19 కోట్ల అప్పు ఉందని వెల్లడించారు. ఆ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారని, ఈ రోజు ఉన్న పరిస్థితిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు తెలియాలనే చెప్పారని అన్నారు. ఇంటి పెద్దగా కుటుంబాన్ని సక్రమంగా నడిపించే ప్రయత్నం చేస్తున్నామని, క్యాన్సర్ సోకితే ఒప్పుకోవాలని బయటకు తెలియకపోతే రోగం ముదురుతుందని పేర్కొన్నారు. ఇదే నిజాన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఒప్పుకోవాలని సూచించారు. పొద్దున లేస్తే అధికార కాంగ్రెస్ పార్టీ మీద ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. సీతారామ ప్రాజెక్టు పనులు తాము పూర్తిచేస్తే కాంగ్రెస్ పార్టీ నీళ్లు చల్లుకుంటుందన్న బీఆర్ఎస్ నేతల మాటలకు పొంగులేటి గట్టి కౌంటర్ ఇచ్చారు. 90 శాతం పనులు పూర్తిచేస్తే ఇంకా 40 శాతం పనులు ఎలా మిగిలి ఉంటాయని ప్రశ్నించారు. కనీసం డ్రైరన్ కూడా చేయని బీఆర్ఎస్ నాయకులు మోటార్లు బిగించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మేం తప్ప ఎవరూ ఏమి చేయలేదనే బావనలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారని, చివరకు గాలిని కూడా మేమే కనుగొన్నామని అంటారేమోనని ఎద్దేవా చేశారు. గాలిని, నీటిని, ప్రజలు తినే ఆహారాన్ని మేమే కనుగొన్నామని అంటే ఎలా అని ప్రశ్నించారు. విమర్శలు చేయాలి తప్పు కాదు..కానీ చేసే విమర్శ సోయీపసొంపుతో ఉండాలన్నారు.

### కుట్రలకు తెర తీస్తున్నారు

**కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రెడిట్ రావద్దని విపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరవెనుక ఉండి కొందరు రైతుల ను ఉసిగొలుపు తున్నా రని ప్రతిపక్ష నాయ కులపై ధ్వజ మెత్తారు. ఎవరెవరు కుట్రలకు పాల్పడు తున్నారో అన్ని విషయాలు అధికారుల వద్ద పూర్తి సమాచారంతో ఉందన్నారు. ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారని, ఇకనైన సక్రమంగా మసలుకోవాలని హితవు పలికారు.**

### రివర్ ఫ్రంట్ కాలనీతో భరోసా..

గతేడాది అకాల వర్షాలకు మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో నివాసముండే వేలాది కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయని, సీఎం రేవంత్ రెడ్డి సహా అనేక మంది మంత్రులు మున్నేరు బాధితులను పరామర్శించి, ఆదుకుని రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగం చేశామన్నారు. తక్కువ ధరకు వస్తుందని ఇక్కడ భూములు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్న పేదలకు రిటైనింగ్ వాల్ తో భరోసా ఉంటుందన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా రివర్ ఫ్రంట్ కాలనీలో చోటు కల్పిస్తామని చెప్పారు. 450 నుంచి 500 ఎకరాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది రిటైనింగ్ వాల్ నిర్వాసితులకు అందులో స్థానం కల్పిస్తామని చెప్పారు.గత ప్రభుత్వం ఆర్భాటంగా జీవో ఇచ్చి వదిలేస్తే రిటైనింగ్ వాల్ ప్రియారిటీని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెండు వైపులా 17 కిలోమీటర్ల మేర భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. రిటైనింగ్ వాల్ కు రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం కూడా చేపడుతామని వెల్లడించారు. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో భూములున్న ఆసాములు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో పేదల పక్షాన ఉంటుందన్నారు.



మహా పత్రిక
ANN తెలుగు

# నత్తనడకన ఇందిరమ్మ మోడల్ ఇల్లు

**4 నెలల క్రితం శంకుస్థాపన చేసిన నేటికీ పూర్తికాని వైనం**

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో, ఇందిరమ్మ మోడల్ ఇల్లు ను సుమారు నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, తహసిల్దార్ నాగ భవాని, చేతుల మీదుగా శంకుస్థాపన చేసి నెలలు నేటికీ నత్త నడకన సాగుతూ పూర్తి చేయని వైనం, మండలంలో శంకుస్థాపనలై ఇల్లు ప్రారంభం. అయినా మోడల్ ఇల్లు ప్రారంభోత్సవం. పోవడం హాస్యాస్పదం సంబంధిత అధికారులు స్పందించి ఇందిరమ్మ మోడల్ ఇల్లును జనాల సందర్శనార్థం ఉంచవలసింది గా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు ఎదురుచూస్తున్నారు



## హరిజన లేబర్ సోసైటీ అధ్యక్షులుగా కనకం ఉపేందర్





**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం చింతలపాడులో హరిజన కాంట్రాక్ట్ లేబర్ సహకార సంఘం ఎన్నికలను సోమవారం సహకారశాఖ అధికారులు నిర్వహించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొందరు హరిజన కాంట్రాక్ట్ లేబర్ సహకారం సంఘం ఏర్పాడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ సంఘానికి సంబంధించి జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ షేక్ మౌలానా సోమవారం ఎన్నికలను నిర్వహించారు. సంఘంలో 5గురు పాలకవర్గానికి సంబంధించి చేతులు ఎత్తు పద్ధతి ద్వారా ఎన్నికలను నిర్వహించారు. కనకం ఉపేందర్, కంపాటి లక్ష్మయ్య, దూడ గణేష్, మెంతిని సంధ్యా, దూడ కుమారి లను సంఘం మహాజనసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అనంతరం ఐదగురి నుండి అధ్యక్షులు కనకం ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కాంపాటి లక్ష్మయ్య, కార్యదర్శిగా దూడ గణేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సహకార శాఖ అధికారులు చిలక రవి, పంచాయతీ కార్యదర్శి యలమద్ది మహేష్. సోసైటీ అధికారులు దొడ్డ ముత్తయ్య, దమ్మాలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యూఎస్,యూకెతో వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలు నిలుపుదల చేయాలి

**ముదిగొండ మే 12 మహా:** యుఎస్,యుకెతో భారత ప్రభుత్వం చేస్తున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలు భారత దేశ రైతాంగానికి త్రీవ నష్టం కలగనున్నదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.మండల పరిధిలో కమలాపురం,పెద్దమండవ గ్రామాలలో రైతు సంఘం నాయకులు తాళ్లూరి రామనాథం అధ్యక్షతన సోమవారం రైతు సదస్సు జరిగింది ఈసదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలు,స్వేచ్ఛ వాణిజ్య వలన భారత దేశ వ్యవసాయం ఒత్తిళ్లకు గురై,రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు.అమెరికా,యునైటెడ్ కింగ్డమ్ భారత వ్యవసాయ ఉత్పత్తులను పూర్తి స్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకునేందుకు వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలుకు ప్రయత్నం చేస్తున్న సమయంలో భారత ప్రభుత్వం ఆదేశల ఒత్తిడికి లొంగిపోతే భారత దేశంలో సాగు రైతులు, వ్యవసాయం మరింత సంక్షోభంలోకి పోతుందన్నారు.




సిఐడి అదుపులోకి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు

దళారీల గుండెల్లో పరుగులు

2019లో కలకలం సృష్టించిన ఫోర్జరీ ఘటన

# తెరపైకి నకిలీ పాస్‌బుక్‌ల ఫోర్జరీ

**దమ్మపేట ,మే 12 మహా :** నకిలీ పాస్ బుక్ లను సృష్టించి ,అధికారులు సంతకాలను ఫోర్జరీ చేసి సత్తుపల్లి పట్టణంలోని ఓ బ్యాంకులో కోట్ల రూపాయలు కుంభకోణం చేసిన ఘటన మళ్ళీ తెరపైకి వచ్చింది. తాజాగా నాలుగు రోజుల క్రితం వరంగల్ డివిజన్ కు చెందిన సిఐడి అధికారులు మండలంలోని ముష్టిబండ ,వెంకటాద్రిగూడెం తదితర ప్రాంతాల్లో ఎంక్వైరీ చేసి ఫోర్జరీ కేసులో నిందితులైన కొందరిని అధుపులోకి తీసుకు వెళ్ళినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2019 ,2020 లలో సంచలనం సృష్టించిన నకిలీ ఫోర్జరీ కేసులో మండలానికి చెందిన కొందరిపై ఆనాడు కేసులు నమోదు చేశారు. కొంతకాలం రిమాండ్ కూడా ఐన సందర్భంలో మరలా తాజాగా ఈ వార్తలు కలకలం రేపుతున్నాయి. ఆనాడు దమ్మపేట తహాశీల్దార్ కార్యాలయ పరిదిలో ఉన్న గిరిజన భూములకు నకిలీ పట్టా పాస్ బుక్ లు సృష్టించి ,వాటిపైన రెవిన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశారనే విషయమై అనేక ఫిర్యాదులు రావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. తీగ లాగితే డొంకంత కదిలిన చందంగా సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్ తో నకిలీ ముఠా నాయకులు చేతులు కలిపి కోట్ల రూపాయల రుణాలు పొందారు. వాటిని అప్పటి ప్రభుత్వం రుణ మాఫీ చేస్తుందనే ధీమాతో ఎడా పెడా నకిలీ పాస్ బుక్ లతో రుణాలు మంజూరు జరిగింది. దీనిలో ఒకొక్కరి వాటా ఒకో విధంగా ఆనాడు లక్షల రూపాయలతో లగ్జరీ జీవితం అనుభవించారు. ఈ నేపథ్యంలో ఓ రైతుకు చెందిన పట్టా పాస్ బుక్ పై రుణం తీసుకోవడానికి బ్యాంకు కు వెళ్ళగా ,అప్పటికే తన పట్టా బుక్ పేరుమీద పంట రుణం పొందినట్లు బ్యాంకు మేనేజర్ తెలపడంతో రైతు నిర్ఘాంతపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు తీగ లాగారు.. ఇంకేముంది.... డొంకంతా కదిలింది. ఏజెన్సీ చట్టానికి విరుద్ధంగా 1/70లో కూడా గిరిజనేతరులకు పట్టా పాస్ బుక్ లను సృష్టించి ,వాటి ద్వారా కూడా పంట రుణాలు పొందారు. ప్రభుత్వం మారినప్పుడు ప్రతిసారి రుణ మాఫీ పొందుతూ దళారులు కుభేరులుగా అవతారం ఎత్తారు. దమ్మపేట మండలంలో కొందరు బడా బాబులు ఈ విధమైన కుంభకోణంలో ప్రముఖ పాత్ర పోషించారు. పోలీసుల విచారణ సమయంలో వారి పేర్లు బయటకు పొక్కకుండా వారు పడిన పాట్లు అన్నీఇన్ని కావు సుమి. అప్పటి వరకు తహాశీల్దార్ గా చేసి ,ఇక్కడి నుండి బదిలీ పై వెళ్ళిన వారి సంతకాలు ఫోర్జరీ చేసి , వాళ్ళద్వారా పట్టా పాస్ బుక్ లను పొందినట్లు అధికారులను నమ్మించి ,ప్రభుత్వారను ,బ్యాంకు లను మోసం చేశారు. అలా ఫోర్జరీ చేసిన పట్టా పాస్ బుక్ ల ఆధారంగా కొన్ని వందలమంది నిరుపేదలు భూములు కోల్పోయిన పరిస్థితి మండలంలో నెలకొంది.

### పట్టా బుక్‌లపై యూనికోడ్ నంబర్ ఉండదు

నకిలీ ఫోర్జరీలతో తయారు చేసిన పట్టాపాస్ బుక్ లపై ప్రభుత్వ యూనికోడ్ నంబర్ కనిపించదు. పట్టా బుక్ మంజూరు చేసిన నాటి తహశీల్దార్ కు , పాస్ బుక్ పై ఉండే తహశీల్దార్ సంతకానికి పొంతన ఉండదు. ఇలా అనేక నకిలీ పట్టా పుస్తకాల ను మండలంలో సృష్టించారు.

### భయం మాటున మిగిలిన నిందితులు

నకిలీ ఫోర్జరీ కేసులో ఆనాడు రిమాండ్ పాలైన కొందరిని మరలా ఎంక్వైరీ నిమిత్తం నాలుగు రోజుల క్రితం వరంగల్ సిఐడి పోలీసు అధికారులు అధుపులోకి తీసుకున్నారనే వార్తలు మండలంలో సంచలనం రేకెత్తించడంతో ,ఆ కేసులో సంబంధం ఉన్న దాదాపు 20 ,నుండి 30 మంది నిందితులకు నిద్రపట్టడం లేదని ,కొందరైతే పరారీలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరికొందరు బిక్కు బిక్కు మంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ గ్రామాల్లో నే తిరుగుతున్నట్లు సమాచారం.

### నకిలీ ఫోర్జరీలతో భ్రష్టుపట్టిన రెవిన్యూ వ్యవస్థ..

చట్టాలకు విరుద్ధంగా పట్టా భూముల కు నకిలీ పాస్ బుక్ లను సృష్టించడంతో ,అసలు పట్టాదారులకు ,అధికారులకు తలనొప్పిగా మారింది. అసలేదో....నకిలీ ఏదో తేడా లేనంతగా నకిలీ పట్టా పాస్ బుక్ లను సృష్టించారంటే ఎంతటి సమర్థులో ఒక సారి అధికారులు ఆలోచించాలి. దీని వలన రెవిన్యూ వ్యవస్థ మొత్తం మండలంలో భ్రష్టు పట్టి పోయింది. ఈ తరహా నకిలీ బుక్ లు కేవలం వ్యవసాయ భూముల కే పరిమితం కాకుండా ఇళ్ళ స్థలాలకు కూడా వ్యాప్తి చేశారు. వాటిలో కూడా నకిలీ నంబర్ లతో రిజిస్ట్రేషన్ లు చేసిన బాగోతాలు కోకొల్లలుగా మండలంలో ఉన్నాయి.

### అధికారులు పర్యవేక్షణ లోపం

నకిలీ బాగోతాలు విలయతాండవం చేస్తుంటే నియంత్రించాల్సిన రెవిన్యూ అధికారులు నాటి నుండి నేటి వరకు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం వల్లనే నిరుపేదల భూముల ను దళారులు దోపిడి చేస్తున్నారనే విమర్శలు మండలంలో బాగా ఉన్నాయి. అధికారులు పర్యవేక్షణ లోప భూయిష్టత స్పష్టంగా కనిపిస్తుందని బాధితులు కొందరు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. నకిలీ ఫోర్జరీ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి

## నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం, మే 12 (మహా):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సోమవారం నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ, ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా




చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని ఇన్స్పెక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మరో చారిత్రక ఆధారం లభ్యం..!

నేలకొండపల్లి, మే 12 మహా: నేలకొండపల్లి చారిత్రక ఆధారాలకు పెట్టింది పేరు గా నిలుస్తుంది. ఇప్పటికే అనేక చారిత్రక ఆధారాలకు అలవాలైన నేలకొండపల్లి తవ్వే కొద్ది అనవాళ్లు...లభ్యమవుతున్నాయి. స్థానిక బౌద్ధసూస్థం సమీపంలోని ఓ రైతు పొలంలో భూమి లోపటికి కూరకపోయిన నలు పలకల రాతి స్థంభం ఒకటి సోమవారం తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్ కట్టా శ్రీనివాస్, పసుమర్తి శ్రీనివాస్ లు పరిశీలన లో వెలుగులోకి వచ్చింది. భూమి పైన రెండు అడుగుల ఎత్తు... అడుగున్నర వెడల్పు ఎనిమిది అంగుళాల మందం ఉన్న ఒక రాతి ఫలకం పైన శాసనాలలో కనిపించే చిహ్నాలు కనిపిస్తున్నాయి. కాకతీయుల కాలంలో శైవానికి



సంబంధించిన, డమురక చిహ్నం, త్రిశూల చిహ్నం తోపాటు సూర్యచంద్రుల చిహ్నాలు ఉన్నాయి. ఆచంద్రార్కం నిలబడి ఉండాలి అనే ఉద్దేశ్యంతో సూర్యచంద్రులను చెక్కేవారు. అటువంటి చిహ్నాలతో ఈ శిలాఫలకం లోని ముఖ పలకం ఉండటంతో ఈ రాతిబండ ను భూమిలో నుంచి బయటకు తీసి పరిశీలించినట్లయితే ప్రాచీన కాలపు శాసనలేమైనా దొరికే అవకాశం ఉండోచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పొలాలలో వరి కోతలు పూర్తి అయిన ప్రోక్లెయిన్ వెళ్లటానికి లి అనుకూలంగా వున్న పరిస్థితులలో దీనిని పెకిలించి లోపట శాసనం వంటిది వున్నదా లేదా..అనే విషయాలను పరిశీలించగలిగే అవకాశం ఉంది. ఇప్పటికే వివిధ కాలాలకు చెందిన అనేక శాసనాలు నేలకొండపల్లి లో దొరికి ఉన్న నేపథ్యంలో మరో కొత్త శాసనం దొరకటం...చరిత్రలో కొత్త కోణాలు వెలుగు లోకి రావటానికి అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించిన తెలంగాణ ఉద్యమకారులు

**ఖమ్మం సిటీ, మహా:** ఎమ్మెల్సీ గా బాధ్యతలు చేపట్టి ఆదివారం ఖమ్మం కు మొదటిసారి వచ్చిన సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం సార్ ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ



కృష్ణారావు , ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటిన ఆసరయ్య , మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి బోయిన వరలక్ష్మి , రాష్ట్ర కార్యదర్శి రాచమల్ల ఉమా యాదవ్ , స్వరూప , ధనలక్ష్మి , అనంతలక్ష్మి , పద్మ లు కలిసి సన్మానించారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు నెరవేరుస్తా అన్న హామీలు 250 గజాల స్థలం , ఇంటి నిర్మాణం కోసం పది లక్షల రూపాయలు , పించలను ఇచ్చే విధంగా ఉద్యమకారుల తరపున ప్రభుత్వంతో మాట్లాడి అమలయ్యే విధంగా చూడాలని కోరారు.

## ఫార్మసీ అధికారులకు ఓరియంటేషన్ శిక్షణ

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫార్మసీ అధికారుల కోసం ఒక రోజు పునఃఓరియెంటేషన్ కమ్ శిక్షణ కార్యక్రమం సోమవారం జిల్లా



వైద్యశాఖ కార్యాలయం ఫస్ట్ ఫ్లోర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతిబాయి ముఖ్య అతిథిగా హాజరై, ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ు ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం, తెలంగాణ హైదరాబాద్ నుంచి వచ్చిన తాజా ఆదేశాల ప్రకారం, ఫార్మసీ అధికారులు తమ తమ కేంద్రాల్లో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్టాక్ వివరాలను అప్‌డేట్ చేయడం తప్పనిసరని తెలిపారు. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులకు అవసరమైన ఐయూడీలు, నోటి మాత్రలు, కండోమ్‌లు, అంతరా ఇంజెక్షన్లు వంటి కమోడిటీల స్టాక్ నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించండి

**భద్రాద్రి కొత్తగూడెం, మే 12 (మహా):** ప్రజావాణి కార్యక్రమం లో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదే



శించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరం లో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు.

## గుంతల మయంగా కోయగూడెం ఓసి రోడ్డు

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం దాసు తండా, గ్రామం నుండి కోయగూడెం. ఓసి వరకు గుంతల మయంగా బీటీ రోడ్డు నిత్యం, భారీ వాహనాలతో బొగ్గు రవాణా చేసే రోడ్డు సింగరేణి యాజమాన్యం. ఓపెన్



కాస్ట్ ద్వారా కోట్లు రోడ్లను పట్టించకపోవడం దురదృష్టకరమని ప్రజలు భావిస్తున్నాను, నిత్యం టేకులపల్లి నుండి బోడు వెళ్లే మార్గం లో ఆటోలు ప్రయాణిస్తుండడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ప్యాచ్ వర్క్ లు చేస్తున్న అక్కడక్కడ నామమాత్రంగానే కనిపిస్తున్న పరిస్థితులు, సంబంధిత అధికారులు చర్యలు. తీసుకోవాలని సామాన్య ప్రజలు ప్రయాణికులు తమ గోడును పట్టించుకోవాలని మొరపెట్టుతున్నారు

## రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ



**బోనకల్,మహా:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నం చందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. సోమవారం బోనకల్ మండలం లక్ష్మీపురం, రాయన్నపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



**నేలకొండపల్లి, మే 12 మహా:** ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించిన ఆర్థిక సహాయం ను అందించారు. మండలం లోరి వివిధ గ్రామాలలో మొత్తం 13 మంది ఇటీవల మృతి చెందారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడారు...మంత్రి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఆ కుటుంబాలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, భద్రయ్య, మాజీ సర్పంచ్లు వంగవీటి నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, పెంటమళ్ల పుల్లమ్మ, యం.వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, వేగినాటి లక్ష్మినర్సయ్య, లక్కం ఏడుకొండలు, కడియాల నరేష్, పాకనాటి కన్నారెడ్డి, కొమ్మినేని శ్రీదేవి, పుష్పావతి, ఆనం వెంకటరెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## రసవత్తర్తంగా మండల సమాఖ్య ఎన్నికలు...!



**నేలకొండపల్లి, మే 12 మహా:** మథర్ థెరిస్సా మండల సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక రసవత్తరంగా మారింది. డీపీఎం రాజారావు సమక్షంలో మండల సమాఖ్య ఎన్నికలు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మొత్తం 15 మంది కార్యవర్గసభ్యులు ఉన్నారు. వీరిలో అధ్యక్ష పదవి కి మొత్తం ఏడుగురు బరిలో నిలిచారు. వీరిలో పైనంపల్లి కి చెందిన కుక్కల సంధ్య ఐదు ఓట్లతో విజయం సాధించారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శి పదవి కి నలుగురు పోటీ చేశారు. బుద్దారం కు చెందిన కె.కరుణ ఆరు ఓట్లతో విజయం సాధించారు. కోశాధికారి పదవి కి పోటీ తీవ్రంగా ఉంది. వీరిలో కొడిరెక్క కవిత 6 ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యాక్షురాలు గా విజయ, ఉప కార్యదర్శి గా పుసులూరి శారద లు ఎన్నికైయ్యారు. అనంతరం నూతన కమిటి ని సమాఖ్య ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పారాలీగల్ వాలంటీర్ కొలిపాక నాగమణి మాట్లాడారు... మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివారణ కు సమాఖ్య కృషి చేయాలని సూచించారు. విక్రయాలు జరగకుండా క్షేత్ర స్థాయిలో ఆందోళన చేయాలని సూచించారు. యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఆర్.శ్రీనివాసరావు, సీసీ పెద్దపాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

### సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**తిరుమలాయపాలెం, మహా:** నిరుపేదలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉండి, ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా తగిన సహాయం అందజేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందజేసారు. తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని 64 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను, 57 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు మొత్తం 18 లక్షల 65 రూపాయల విలువ గల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ఉండేందుకు చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేస్తుందని, ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదల కష్టాలలో పాలు పంచుకోవాలని కళ్యాణలక్ష్మితో పాటు, ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందని, ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ క్రింద గడచిన సంవత్సర కాలంలో 1056 కోట్లు విడుదల చేసిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. మే నెలాఖరు వరకు అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపడతామని, నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం కార్యక్రమం ద్వారా ప్రతి నియోజకవర్గంలో 4 వేల మందికి చేయూత నిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల కోట్లు ఖర్చు చేసి సబ్సిడీ యూనిట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం గోపాయిగూడెంలో ఎస్.డి.ఎఫ్. నిధులు 13.50 లక్షలతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని, తరుగు పేరిట కటింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. మేడిదపల్లి గ్రామం ఎస్.సి. కాలనీలో 16 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, తిమ్మక్కపేటలో 35 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, ఎర్రగడ్డ ఎస్.సి. కాలనీలో 30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్రసీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఏడిఏ సరిత, తిరుమలాయపాలెం ఎంపిడివో ఎస్కె. సిలార్ సాహెబ్, ఇంచార్జ్ తహసీల్దార్ సుధీర్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మే 12 ప్రపంచ నర్స్ డే



**టేకులపల్లి - మహా:** మదర్ ఆఫ్ నర్సింగ్,ద లేడీ విత్ ద లాంప్, ప్రపంచంలోని మొట్టమొదటి నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదిన సందర్భంగా ప్రతి సంవత్సరం మే 12 వ తేదీన ప్రపంచ నర్స్ డే జరుపుకుంటాము ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ లో ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని హెడ్ నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన వృత్తి ఏదైనా ఉంది అంటే అది నర్సింగ్ వృత్తి అని అత్యంత ఓపిక సహనం సేవా నిరతి కలిగి తమ అమూల్యమైన సేవలతో నిత్యం ఎంతోమంది రోగులకు ప్రాణం పోస్తూ వారు త్వరితగతన కోలుకోవడానికి అందించే సేవలు వెలకట్టలేనివి అని ఈ వృత్తి అందరికీ రాదని నిష్కల్మషంగా రోగులకు సేవలు అందించే నర్సులమ్మలందరికీ శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీమతి వజ్జా పార్వతి గారిని సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలోకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ సూపర్వైజర్లు గుజ్జా విజయ పోరండ్ల శ్రీనివాస్ ధర్మపురి రవికుమార్ కిరణ్ కుమారి రాజు గంటా శ్రీనివాస్ నాగలక్ష్మి కమల రమా కుమారి సుజాత కళావతి స్వప్న లక్ష్మీ బాయి అరుణ్ కుమారి స్రవంతి వెంకటరమణ అనసూర్య మల్లు విజయలక్ష్మి పాల్గొన్నారు

### కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన
## మంత్రి పొంగులేటి

**కూసుమంచి, మే 12, మహా:** కూసుమంచి మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను సోమవారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 14 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో కూసుమంచి ఇన్ ఛార్జ్ తహసిల్దార్ కరుణశ్రీ, తాజా మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# బౌద్ధక్షేత్రం అభివృద్ధి పై ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణం



నేలకొండపల్లి, మే 12 మహా: దక్షిణ భారతదేశంలో కెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రం ను అభివృద్ధి పై ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని సమతా సైనిక్ తల్ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు రేజర్ల రాజేష్ పేర్కొన్నారు. స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద సోమవారం బుద్ధుని జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...బౌద్ధక్షేత్రం పట్ల పాలకులు నిర్లక్ష్యం వీడాలని సూచించారు. గత ప్రభుత్వం సాగర్ లో అభివృద్ధి చేసినట్లే....నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది జయంతి ఉత్సవాలను లక్షలాది మందితో స్థానిక. బౌద్ధక్షేత్రం వద్ద ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఆ ఉత్సవాలకు సీఎం రేవంత్రెడ్డి ని అహ్వానిస్తామని అన్నారు. ఇప్పటికైనా టూరిజం మరియు ప్రభుత్వ అధికారులు బౌద్ధక్షేత్రం పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేపట్టాలని సూచించారు. కనీస వసతులు కూడ కల్పించటం లో విఫలమవుతున్నారని అన్నారు. బుద్ధుని మార్గం ను భవిష్యత్ తరాల వారికి అందించే మహత్కార్యాన్ని ప్రతీ ఒక్కరూ బాధ్యత గా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడ నమ్మకాల నిర్మూలన వ్యవస్థాపకులు బైరి నరేష్. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పగిడికత్తుల ఈరయ్య. పెద్దపాక వెంకటి. రాజేశ్వరరావు, రవి, సంపత్, బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయండి



మణుగూరు,మహా: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని,కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్ ల రద్దు కు వ్యతిరేకంగా మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బిటిపిఎస్ సిఈ బిచ్చన్నకు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా కార్మిక,రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు.సామాన్యులపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు స్వదేశీ,విదేశీ సంపన్నులకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై భారాలు మోపుతుందని మండిపడ్డారు.మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్,డీజిల్,వంటగ్యాస్ తదితర నిత్యవసర సరుకుల ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా విదేశీ కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆయన అన్నారు. ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సంఘటిత,అసంఘటిత కార్మికులు అత్యధికంగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు,నైనారపు నాగేశ్వరరావు,గడదేశి మోహన్ రావు,అల్లి సుధాకర్ ఆర్ శ్రీను సాంబయ్య ఎగ్గడి రవి. శ్రీను. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు



కూసుమంచి, మే 12, మహా: కూసుమంచి ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపును సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపు ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి 11 వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, ఆటలు, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ , యోగా తదితర అంశాలపై ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9 వ తరగతి చదివే విద్యార్థులు ఈ శిబిరానికి రావొచ్చునని పేర్కొన్నారు.విద్యార్థులకు మంచినీరు, అల్పహారం, మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి కాలంలో సమయం వృథా చేసుకోకుండా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , సీఆర్పీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అరుగుపై కూర్చొని.. అర్జీలు స్వీకరిస్తూ..

- కటిక నేలపై కూర్చొని.. కష్టాలు తెలుసుకుంటూ... ఆదివాసీ జనంతో మమేకమైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి
- పూర్తిగా అటవీ ప్రాంతంలో కొనసాగిన పర్యటన.. రూ.2.47 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పేరాయిగూడెం, చెన్నాపురం అటవీ ప్రాంతాల్లో పర్యటించిన తొలి ఎంపీ అంటూ.. కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీలు



అశ్వారావుపేట, మహా: పూర్తిగా అటవీ ప్రాంతం.. ఖమ్మం నుంచి 160 కిలోమీటర్ల దూరం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నుంచి 34 కి. మీ. దూరం.. అంతా దట్టమైన ప్రాంతం గుండా.. పెద్ద వాగు, అనంతారం, చిన్న వాగు, కట్లంవాగు..ఇలా వాగులూ.. వంకలూ దాటుకొని ఆదివాసీ గూడేల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రాఘురాం రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మారుమూల ఆదివాసీ పేరాయిగూడెం రూ. 1.40కోట్లు, చెన్నాపురంలో రూ. 1.07 కోట్లు.. మొత్తం రూ. 2.47 కోట్ల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా..పేరాయిగూడెం గ్రామ పంచాయతీ వద్ద అరుగుపై ఎంపీ రఘురాం రెడ్డి కూర్చొని గ్రామసభ నిర్వహించారు. చెన్నాపురం గ్రామంలో గ్రామ సెంటర్ లో సీ సీ రోడ్లను ప్రారంభించి.. అక్కడ నేలపై వేసిన పట్టాపై కింద కూర్చొని ఆదివాసీల యోగక్షేమాలు తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి తన లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వేలాది కోట్లను వెచ్చిస్తోందని చెప్పారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. ఏలూరు జిల్లా సరిహద్దులో గల తమ గ్రామాలకు వచ్చి, నిధులు కేటాయించి అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ రామ సహాయం రెడ్డికి ఆయా గ్రామాల ఆదివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు యే ఎంపీ తమ వద్దకు రాలేదని తెలిపారు. మంచి పరసోదమ్.. సార్ అంటూ ( చాలా ధన్యవాదాలు).. అంటూ ఆదివాసి భాషలో కృతజ్ఞతలు తెలిపారు.

# నర్సుల సేవలు ఎనలేనివి..

అశ్వారావుపేట, మహా: వైద్యవృత్తిలో నర్సులు అందించే సేవలు మరువలేనివని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. అశ్వారావుపేటలోని ప్రభుత్వ ప్రాతీయ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవానికి హాజరై కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యుల తర్వాత.. అంతటి సేవలు నర్సులు అందిస్తారని.. వారికి ఎప్పుడూ అండగా ఉంటానని అభయమిచ్చారు. ఇటీవలి యుద్ధం లో వీర మరణం పొందిన అమర సైనికులకు కొవ్వొత్తులు ముట్టించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకున్న ఖమ్మం ఎంపీ



అశ్వారావుపేట, మహా: అశ్వారావుపేట నియోజకవర్గం చెన్నాపురం గ్రామం సరిహద్దులో గల ఏలూరు జిల్లా బుట్టాయగూడెం పరిధిలో గల శ్రీశ్రీశ్రీ గుబ్బల మంగమ్మ తల్లి దేవస్థానాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం సందర్శించుకున్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# నృసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, మహా:** అశ్వాపురం మండలం చింతిర్యాలగూడెం గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతిర్యాల గూడెం గ్రామంలో ఘనంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను గ్రామస్తులను ఎమ్మెల్యే అభినందించారు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవానికి రావడం స్వామివారిని దర్శించుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళ కలిగి ఉండాలని స్వామివారిని కోరుకున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య , అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

**మణుగూరు,మహా:** మున్సిపాలిటీ పరిధిలోని అరుంధతి నగర్, సుందరయ్య నగర్, వినాయక నగర్, బాలాజీ నగర్, భగత్ సింగ్ నగర్ లో రూ,20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీలు, సీసీ రోడ్లకు పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు సోమవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికీ కట్టుబడి ఉన్నదని గ్రామాల్లో, మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం నుండి అనేక నిధులు మంజూరు చేయించి పినపాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ టీ.ప్రసాదరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే సత్య , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి శ్రీనివాసరావు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ , టౌన్ అధ్యక్షులు శివ సైదులు , కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీఆర్ఏ మృతదేహానికి ఎమ్మెల్యే నివాళ్లు



**కారేపల్లి, మహా:** కారేపల్లి భగత్ నగర్ కాలనీకి చెందిన వీఆర్ఏ వేమూరి వెంకన్న మృతి చెందాడు. అయన మృతి దేహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసం నాయక్ సందర్శించి నివాళ్లు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



**కారేపల్లి, మహా:** గంజాయి ని తరలిస్తున్న ఇద్దరిని సోమవారం కారేపల్లి పోలీసులు పట్టుకోని అరెస్టు చేసినట్లు సింగరేణి సీఐ తిరుపత్తిరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కారేపల్లి క్రాస్‌రోడ్‌లో ఎస్సై ఎన్.రాజారామ్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా బ్యాగులో 2 కేజీల ఎండు గంజాయి దొరికిందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ప్రాంతానికి చెందిన వాలిపిరెడ్డి రాజ్ కమల్ (27) గతంలో ఇల్లందు, కారేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు హత్య కేసుల్లో ప్రధాన నిందుతుడు. దీంతో పాటు ఖమ్మం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఒక గంజాయి కేసులో వాలిపిరెడ్డి రాజ్‌కమల్ నిందితుడు. ఇతను కొత్తగూడెం ప్రాంతానికి చెందిన కుంజా దీలిప్ (28) తో కలిసి గంజాయి విక్రయించేందుకు కారేపల్లి క్రాస్ రోడ్డులో వేచి చూస్తున్న క్రమంలో పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారని సీఐ పేర్కొన్నారు. నిందితుల నుండి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోని ఎన్‌డీపీఎస్ చట్టం క్రింద వారిపైకేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

## వెంకటసాయినగర్‌లో ఘనంగా బోనాలు



**కారేపల్లి, మహా:** కారేపల్లి శ్రీ వెంకట సాయినగర్ లో సోమవారం గ్రామ దేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీలో మూడు రోజులుగా నూతనంగా బద్రాయి, ముత్యాలమ్మ తల్లి, శ్రీ అంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడోవ రోజు గ్రామదేవతలకు మహిళా లు బోనాలను ఊరేగింపుగా వచ్చి బోనాలను సమర్పించారు. బోనాల పండుగతోవెంకట సాయినగర్ లో పండుగ వాతావరణ ని నెలకొంది. ఈ కార్యక్రమంలో వెంకటసాయినగర్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, ఈసం భాస్కర్, కమిటీ సభ్యులు రాంబాబు ,నాగేశ్వరరావు ,సమ్మయ్య, దుర్గయ్య, రామారావులు పర్యవేక్షించగా.. కాలనీ పెద్దలు కర్ణ, సాంబ, హనుమంతరావు, శంకర్, ఈశ్వర్, నగేష్, శివ, సీతారాం, పొదెం రాజు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
13-5-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు


# అక్రమ ఫైనాన్స్ వ్యాపారాలపై పోలీసుల దాడులు

- ఆనాధికార చిట్స్ నిర్వహిస్తున్న వ్యాపారుల ఇండ్లలో పోలీసులు సోదాలు
- వ్యాపారుల నుండి 120 ఖాళీ బ్యాంక్ చెక్స్, 570 ప్రాంసరీ నోట్లు, 38 బాండ్లు స్వాధీనం
- అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు
- ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి

**ఖమ్మం, మహా:** నిబంధనలకు విరుద్ధంగా చిటీలు, ఫైనాన్స్/ గిరిగిరి వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇండ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నగరంలో నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రవేటు చిట్స్, అధిక వడ్డీలతో ప్రజలను పీడిస్తున్న ఫైనాన్స్/ గిరిగిరి వ్యాపారుల ఇండ్లలో ఏకకాలంలో 11 చోట్ల దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. లక్షల విలువ చేసే 120 ఖాళీ బ్యాంక్ చెక్స్, 570 ప్రాంసరీ నోట్లు, 38 బాండ్లు లభ్యమ య్యాయినట్లు తెలిపారు. చిట్ నిర్వహుకులు తమ కస్టమర్ల నుండి సేకరించిన డబ్బును చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న చిట్స్, ఫైనాన్స్ వ్యాపారుల ఇండ్లలో తనిఖీ చేసి ఆరుగురిలో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అధిక వడ్డీ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.



మహా ఎఫెక్ట్



## ఇసుక అక్రమ రవాణా జరిగితే ఉక్కుపాదం మోపుతాం

### సబ్ ఇన్స్పెక్టర్ నాగుల్ మీరా

**చింతకాని, మహా:** చింతకాని మండలం పరిధిలోని చిన్నమండవ గ్రామంలో ఇసుక రవాణా జరిగే వారిపై ఉక్కు పాదం మోపుతామని సబ్ ఇన్స్పెక్టర్ నాగుల్ మీరా తెలియజేశారు ... చిన్నమండవ గ్రామంలో ఇసుక రవాణా జరుగుతున్న విషయం డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుసుకొన ఎస్సై తన సిబ్బందితో గ్రామంలోని జెసిపి తీసుకువెళ్లి ట్రాక్టర్స్ తిరగకుండా గాడి కొట్టించడం జరిగింది.. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వార ఎలాంటి పర్మిషన్ లేకుండా కొంతమంది ప్రవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని , ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారని డబ్బులు వసూలు చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తెలియజేశారు .... గాడిని తొలగించి ఇసుక రవాణాచేసిన డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే వారు ఎంతటి వారైనా కేసు నమోదు చేస్తామని తెలియజేశారు...ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటే, రాములు సురేష్ పాల్గొన్నారు...



# దోపిడీ ఆస్పత్రులు

**ఖమ్మం - మహా:** వైద్యం అనేది ఓ సేవ. అది వ్యాపారం అయితే, రోగి కేవలం ఖాతాదారుడే అవుతాడు. కానీ ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంగా నెలకొన్న వైద్య వ్యవస్థ గుండెను తాకే మానవీయతను కోల్పోయి, నగదు లెక్కించే నిధి యంత్రంగా మారింది. వైద్యం అనే మాటకు కనీస మానవీయ అర్థం లేకుండా పోయింది. ఖమ్మం జిల్లాలో 422 హాస్పటల్ ఉన్నాయి. వీటిలో 80 శాతం ప్రైవేట్ ఆసుపత్రులు వాణిజ్య గదుల్లో మారిపోయాయి. అంబులెన్స్ సైరన్లు నడిచే బదులు, బిల్లుల బజార్ అరిచే స్థాయికి చేరాయి. వైద్య కళను అధిక వడ్డీతో పెట్టుబడిగా మార్చిన యాజమాన్యాల మానవ హక్కుల హత్య ఇది. ఇది ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిన సంకేతం కాదు... ఇది ప్రజాస్వామ్య చైతన్యానికి ఇచ్చే అత్యవసర హెచ్చరిక! ప్రతి ఆసుపత్రిలో ఓ గదిలో కన్నీరు ఉంటుంది. ప్రతి బిల్లులో ఓ కుటుంబ బాధ ఉంటుంది. ఖమ్మంలో వైద్య వ్యవస్థ ప్రజలను రోగులుగా కాకుండా, ఆదాయ వనరులుగా చూడడం ప్రారంభించింది. ఇది ప్రశ్నించాల్సిన సమయం. వైద్యం సేవ అవ్వాలి... వ్యాపారం కాదు అని హక్కుగా చెప్పాల్సిన సంక్షోభపు దశ ఇది.




## అనుమతుల్లేని ఆసుపత్రులు .. మరణాలకి గేట్లు!

ఖమ్మంలో అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులు గుట్టలుగా వెలిసాయి. పచ్చబత్తుల్లా పుట్టిన ఈ ఆసుపత్రుల్లో ప్రభుత్వ నిబంధనలు శూన్యం. అత్యవసర వైద్యానికి అవసరమైన సిబ్బంది లేదు, పరికరాల్లేవు, కానీ వైద్యం పేరుతో లెక్కలేని బిల్లులు వసూలు చేస్తున్నారు. ప్రజల జీవన హక్కును దోచుకునే ఈ వ్యాపార కేంద్రాలకు ఎవరు లైసెన్స్ ఇచ్చారు? అధికారుల నిర్లక్ష్యమా? లేక రాజకీయ నాయకుల సంరక్షణామా?

## డబ్బు లేనిదే చికిత్స జరగదు !

అపరేషన్ చేయాలంటే ముందుగా లక్షల్లో బిల్లు చెల్లించాలంటూ బెదిరింపులు. రోగి పరిస్థితి ఎంత క్లిష్టమైనదైనా, ముందుగా అడ్వాన్స్ ఇవ్వకపోతే తలుపులు మూసే పరిస్థితి. ఒక రోగిని గుండె ఆపరేషన్ కోసం తీసుకెళ్లినప్పుడు, “ముందు పది లక్షలు ఇవ్వండి” అంటూ రిసెప్షన్ వద్దే అడ్డుకున్న ఘటనలు లెక్కలేనన్ని.

## కెమెరాల వెనుక నకిలీ వైద్యులు

ఒక చిన్న గాయానికి వచ్చిన వ్యక్తికి శస్త్రచికిత్స చేసిన నకిలీ డాక్టర్... ఆ తర్వాత అతని జీవితం చీకట్లో కూరుకుపోయింది. ఖమ్మంలోని కొందరు ఆసుపత్రుల్లో ఎంబిబిఎస్ లేకుండా నకిలీ సర్టిఫికెట్లతో పని చేస్తున్నవారు శస్త్రచికిత్సల వరకు చేస్తున్నారు. ఆర్ ఎం పి లకి 50% కమిషన్ ఇస్తూ... “రోగులను పంపించండి” అంటూ ఓవర్‌టైం ఆఫర్లు!

## టెస్టులు.. ఓపరేషన్లు అవసరం లేకపోయినా తప్పనిసరి!

“మీకు బీపీ ఉంది... కానీ జాగ్రత్తగా చూడాలి, హార్ట్ లో బ్లాక్ ఉండొచ్చు” అంటూ భయపెట్టి సిటీ స్కాన్, ఎంఆర్ఐ, థైరాయిడ్, బ్లడ్ టెస్టులు ం ఇలా రోగి తలపట్టుకునేలా చేస్తారు. చివరికి “మీకో చిన్న ఓపరేషన్ అవసరం” అంటారు. అసలు రోగం మర్చిపోయేలా చేస్తారు. ఇది ఖమ్మంలో మారుమూల ప్రాంతాల నుంచే కాదు, నగర మధ్య భాగాల్లోనూ నడుస్తున్న వైద్య మాఫియా తంతు.

## సీఎంఆర్ఎఫ్ కూడా మోసం ప్రభుత్వ నిధుల కుంభకోణం!

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చే సీఎం రిలీఫ్ ఫండ్ కూడా ఖమ్మంలో వ్యాపార యంత్రంగా మారిపోయింది. “కిడ్నీ ఫెయిల్యూర్”, “హార్ట్ సర్జరీ”, “బ్రెయిన్ ట్యూమర్” అనే నకిలీ కేసులు చూపించి, నిధులు విత్‌డ్రా చేసి మళ్లీ ఆ డబ్బుతో మరొకరిని మోసం చేస్తున్న ఘటనలు బయటపడుతున్నాయి. ఒక ప్రైవేట్ ఆసుపత్రి మాత్రం గత ఏడాదిలో 46 కేసులకు రూ. 1.2 కోట్లు డబ్బు చేసిందన్నది నిఖార్సైన ఆధారం.

## బిల్లు లేకుండా డిశ్చార్జ్ లేదు .. పేషంట్లను బంధకులు చేస్తూ...

చికిత్స పూర్తయినా... బిల్లు మొత్తం చెల్లించేదాకా రోగిని డిశ్చార్జ్ చేయకుండా బెదిరింపులు. బంధువులు సమయానికి డబ్బు తెచ్చినా... కొన్ని ఆసుపత్రులు లేట్ పేమెంట్ ఛార్జ్ పేరిట మరిన్ని రకాలను జోడించి బిల్ పెంచేస్తున్నాయి. ఎవరు చూసుకోవాలి దీనిని?

## ధర్నాలు చేస్తే కేసులు పౌర హక్కులకు తూటాలు!

దోపిడీకి గురైన రోగి బంధువులు ఆసుపత్రి ముందు నిరసన తెలిపితే... వెంటనే పోలీసు స్టేషన్ నుంచి ఎస్ఐ వచ్చి కేసు పెడతాడు. “పబ్లిక్ న్యూ సెక్స్ “, “తప్పుడు ఆరోపణలు”, “ఆస్తిపై దాడి” వంటి సెక్షన్లు. బాధితులే నిందితులుగా మారిపోతున్నారు! ప్రజాస్వామ్యం అంటే ఇదా?

## ఆసుపత్రులపై దాడులు చేసిన అధికారులపై ఒత్తిడులు

దాడులు చేసిన ఆరోగ్యశాఖ అధికారులపై రాజకీయ నాయకులు ఒత్తిడి తెచ్చి, వారి బదిలీలు కూడా చేయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అనుమతుల్లేని ఆసుపత్రులను మూసేయాలని ఇచ్చిన నోటీసులు, తర్వాత వెనక్కి తీసుకోవడం ఎందుకు? ఎవరి ఒత్తిడికి?

### సౌకర్యాలులేని ఆసుపత్రులకే లైసెన్సులు

ఓ ఆసుపత్రిలో ఆక్సిజన్ సిలిండర్ పనిచేయక పోవడంతో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ ఆసుపత్రికి ఇంకా లైసెన్స్ ఎందుకు ఉంది? కనీస అంబులెన్స్ సౌకర్యం లేకుండా ఎలా పని చేస్తున్నాయి? ఎవరు ఈ బాధ్యత తీసుకుంటారు?

### ప్రభుత్వం మౌనంగా ఎందుకు?

ఇన్ని అక్రమాలు... ఇన్ని దోపిడీలు... అయినా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? ప్రజల ఆరోగ్యం ఓ ప్రభుత్వ బాధ్యతగా మారాలని నినాదాలు చేసిన నాయకులు ఇప్పుడు ఎందుకు స్పందించటం లేదు? ప్రజల హక్కులు వ్యాపారానికి తాకట్టు పెట్టిన ఈ వ్యవస్థను ప్రశ్నించకపోతే% ప్రజాస్వామ్యం బతికే మార్గం ఉండదు.

### ప్రజా పోరాటమే మార్గం!

ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే... ప్రజల పోరాటం తప్పదు. తక్షణంగా అనుమతులేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి. నకిలీ డాక్టర్లను అరెస్ట్ చేయాలి. అక్రమ బిల్లులకు అడ్డుకట్ట వేయాలి. సీఎంఆర్ఎఫ్‌ను నిఘాలోకి తీసుకురావాలి. ఆరోగ్య శాఖలో బాధ్యత లేని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇది ప్రజల డిమాండ్ మాత్రమే కాదు ... అవసరం.

